అత్యవసర సేవలకు టోల్‌ఫ్రీ నంబర్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏవైనా సమస్యలు తలెత్తినా, సహాయం కావాలన్నా పొందేందుకు అయా కలెక్టరేట్‌లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, టోల్ ఫ్రీ నంబర్లను అందుబాటులో ఉంచారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 08542-241165 నెంబరును ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లాలో 08545-233525, 08545-220351 నంబర్లకు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 08540-230201 నెంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. నారాయణపేట జిల్లాలో 9154283914, జోగుళాంబ గద్వాల జిల్లాలో 9100901605 నెంబరును సంప్రదించాలని, ఈ నంబర్లు 24 గంటలు అందుబాటులో ఉంటాయని వివరించారు.


నారాయణపేట మండలం భూనేడ్-అభంగాపూర్ మధ్య ఉధృతంగా పారుతున్న వాగు


అచ్చంపేట మండలం ఉమామహేశ్వర ఆలయం వద్ద మెట్లపై విరిగిపడిన కొండచరియలు


మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం పోతులమడుగు వద్ద విద్యార్థులను వాగు దాటిస్తున్న పోలీసులు


హన్వాడ మండలం గుడిమల్కాపూర్‌లో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును తాడు సహాయంతో దాటుతున్న రైతులు

జడివాన



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరు వర్షం
- స్తంభించిన జన జీవనం
- నిండి అలుగు పారిన చెరువులు, వాగులు
- నీట మునిగిన పంటలు
- జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో నిలిచిన రాకపోకలు
- నాగర్‌కర్నూల్ జిల్లా ఉమామహేశ్వర ఆలయం వద్ద మెట్లపై విరిగి పడిన కొండ చరియలు
- మహబూబ్‌నగర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- మూడు జిల్లాల్లో కూలిన పది మట్టి ఇళ్లు.. ఒకరి మృతి
- ఊట్కూర్ మండలం మల్లెపల్లి, అచ్చంపేట వద్ద వరదల్లో కొట్టుకుపోతున్న కార్లను బయటికి తీసిన స్థానికులు
- నీటిలో చిక్కుకున్న జడ్చర్ల వంద పడకల ఆస్పత్రి
- నారాయణపేట జిల్లా మరికల్‌లో అత్యధికంగా 138.6 మి.మీ. వర్షం
- జూరాల ప్రాజెక్టు, సంగంబండ, రామన్‌పాడు రిజర్వాయర్ల గేట్ల ఎత్తివేత


అలుగు పారుతున్న నారాయణపేట మండలం కోటకొండ చెరువు


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీలో జలమయమైన రోడ్డు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం బీభత్సం సృష్టించింది. శుక్రవారం రాత్రి మొదలైన వాన శనివారం రోజంతా కురిసింది. ఎడతెరిపి లేని కుండపోత వానతో జన జీవనం స్తంభించింది. రహదారులపై వాగులు ఉప్పొంగడంతో రాకపోకలు స్తంభించాయి. చాలా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఐదు జిల్లాల్లో వాగులు, వంకలు, చెరువులు పొంగి పొర్లాయి. పత్తి, వరితో పాటు ఇతర పంటలు నీట మునిగాయి. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం తాటి పాములలో ఇల్లు కూలి ఒకరు చనిపోయారు.

నాగర్‌కర్నూల్/ మహబూబ్‌నగర్/నారాయణపేట/ గద్వాల/ ఉండవల్లి/ వనపర్తి అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వానతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చెరువులు, కుంటలు అలుగు పారగా, పంటలు నీట మునిగాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో చెక్ డ్యామ్‌లు, పలు చెరువులు అలుగులు పారుతున్నాయి. ఇంకో వాన కురిస్తే జిల్లాలోని అన్ని చెరువులు అలుగులు పారనున్నాయి. ఎడతెరిపి లేని వానతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పలు గ్రామాల వాగులు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జడ్చర్ల, దేవరకద్ర, నవాబ్‌పేట, సీసీకుంట మండలాల్లో భారీ వర్షం కురిసింది. జడ్చర్లలో కురిసిన వానకు వంద పడకల ఆస్పత్రిని వరదనీరు తాకింది. దవఖానాను లోతట్టులో నిర్మించడం వల్ల చుట్టూ భారీగా నీరు చేరడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిడ్జిల్, జడ్చర్ల, రాజాపూర్ పరిసరాలలోని దుందుభీ వాగు ప్రవహిస్తోంది. కౌకుంట్ల మండలంలో భారీ వర్షం కురువగా వాగులు ప్రవహి`స్తున్నాయి. మండల పరిధిలోని ఇస్రంపల్లి వాగు బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో బ్రిడ్జిపైకి ప్రయాణికులు వెళ్ళకుండా రెండువైపులా అధికారులు కంప వేయించారు. సీసీకుంట మండలం బండ్రవల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వానకు నవాబ్‌పేట మండలం-కొండుర్గు మండ లాల మధ్య వాగుపై నీరు ప్రవహి స్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. హన్వాడ మండలం గుడిమల్కాపూర్ పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రైతులు తాడు సాయంతో వాగు దాటి పొలాలకు వెళ్ళాల్సి వచ్చింది. మరో రెండ్రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే మహబూబ్‌నగర్‌ను పింక్ అలర్ట్‌గా ప్రకటించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. చెరువులు జలకళను సంత రించుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లో లెవల్ బ్రిడ్జిలపై స్తంభించిన రాకపోకలు

నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోలెవల్ బ్రిడ్జిలపై నుంచి రాకపోకలు స్తంభించాయి. రేపు, ఎల్లుండి కూడా జిల్లాలో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. తాడూరు మండలం సిర్సవాడ వద్ద దుందుభీ నది దాటడానికి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఉమామహేశ్వర క్షేత్రం వద్ద ఆలయం పైనున్న కొండచరియల నుంచి జాలు అధికం కావడంతో ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. మెట్లపై కొండ చరియలు విరిగి పడ్డాయి. పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ గ్రామంలో కొండ్రాయి చెరువు ఉధృతంగా ప్రవహించడంతో కొండ్రాయి, బావాయిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తెలకపల్లి మండలంలోని అనంతసాగర్ చెరువు అలుగు పారడంతో మాధారం, సిర్సవాడ గ్రామాల మధ్య రాకపోకలను పోలీసులు నిలిపేశారు. ఎస్‌ఐ వీరబాబు రక్షణ కంచెను ఏర్పాటు చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ జలమయమైంది. కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడి గుండం పెద్ద వాగు ఉప్పొంగడంతో నల్లమల్ల గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ముక్కిడి గుండం గ్రామ గిరిజనులు కొల్లాపూర్‌కి రావాలంటే మొలచింతలపల్లి మీదుగా రావాల్సిన పరిస్థితి నెలకొంది. అచ్చంపేట పట్టణంలోని ఉప్పునుంతల రోడ్డులో కల్వర్టుపై వరదలో కొట్టుకు పోతున్న కారును స్థానికులు కాపాడారు. ఆ సమయంలో కారులో ఇద్దరు ఉన్నారు.

నీట మునిగిన పంటలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో భారీ వర్షం కురిసింది. గద్వాల మండలంలోని బీరెల్లి, రేకులపల్లి గ్రామాల్లో 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వడ్డేపల్లి, మానవపాడు, ఉండవెల్లి, ఇటిక్యాలలో కాజ్‌వేలపై నీళ్లు పారుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ జోన్‌లో ఉంచడంతో అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావొద్దని అధికారులు చెబుతున్నారు. ఉండవల్లిలో చిన్న నాగమ్మ ఇంటి పాత గోడ కూలడంతో పక్కనే నిలిపిన ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమైంది. జడ్పీహెచ్‌ఎస్‌లో నాలుగు తరగతి గదులు నీళ్లు కారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో రైతులు పొగాకు నాటారు.

పొంగి పొర్లిన వాగులు

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంతో వనపర్తి జిల్లాలోని పలు గ్రామాల్లో చెరువులు, వాగులు పొంగిపొర్లాయి. పలు మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతంలో ఉండే ఆత్మకూరు, చిన్నంబావి, వీపనగండ్ల, పెబ్బేరు మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.


ఊట్కూర్ మండలం మల్లెపల్లి వాగులో కొట్టుకుపోతున్న కారును బయటికి తెస్తున్న స్థానికులు


మల్లెపల్లి గ్రామస్థులను ట్రాక్టర్ ద్వారా వాగు దాటిస్తున్న గ్రామ నాయకులు


నారాయణపేట మండలం కోటకొండ-ఇంజమూర్ రోడ్డు మధ్యలో విరిగి పడిన భారీ కొండ రాయి


జడ్చర్లలోని వంద పడకల ఆస్పత్రిని చుట్టు ముట్టిన వరద నీరు


అడ్డాకుల మండలం వర్నె వాగుపై కొట్టుకుపోయిన మట్టి రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

భారీ వర్షపాతం నమోదు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం భారీ వర్షపాతం నమోదైంది. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలో అత్యధికంగా 138.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దామరగిద్ద మండలంలో 129.2 మిల్లీ మీటర్లు, కోస్గిలో 81.4, నారాయణపేటలో 77, మద్దూర్‌లో 76, ధన్వాడలో 72.2, మక్తల్‌లో 54.8, ఊట్కూర్‌లో 41.4, నర్వలో 36.2, మాగనూర్‌లో 21.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

నాగర్‌కర్నూల్‌లో..

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో అత్యధికంగా 100.4 మిల్లీ మీటర్ల వాన పడింది. తిమ్మాజిపేటలో 86.4 మిల్లీ మీటర్లు, లింగాలలో 84.6, కోడేరులో 81.4, నాగర్‌కర్నూల్‌లో 69.8, బిజినేపల్లిలో 65.2, అచ్చంపేటలో 60.4, కల్వకుర్తిలో 63.4, బల్మూరులో 59.4, అమ్రాబాద్‌లో 54.6, తెలకపల్లిలో 52.6, తాడూరులో 46.4, పదరలో 36.8, కొల్లాపూర్‌లో 22.4, ఊర్కొండలో 41.9, వంగూరులో 14.8 మిల్లీ మీటర్ల వాన కురిసింది.

మహబూబ్‌నగర్‌లో..

మహబూబ్‌నగర్ జిల్లా కౌకుంట్ల మండలంలో అత్యధికంగా 89.2 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. జడ్చర్లలో 71.3, దేవరకద్రలో 67.7 మిల్లీ మీటర్లు వాన పడింది.

వనపర్తిలో..

వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో 75.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, గోపాల్‌పేటలో 73.2, ఘణపూర్ 71.5, పెద్దమండడి 64.9, వనపర్తి 61.0, పెబ్బేరు 50.5, మదనాపూర్ 49.6, కొత్తకోట 48 మిల్లీ మీటర్ల వాన పడింది. శ్రీరంగాపూర్ 39.6, అమరచింత 35.6, ఆత్మకూరు 33.6, వీపనగండ్ల 30.7, చిన్నంబావి 25.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

జోగుళాంబ గద్వాలలో..

జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో 54 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉండవెల్లిలో 48, గద్వాలలో 44, మానవపాడులో 42, ఇటిక్యాలలో 41, ధరూర్‌లో 36, వడ్డేపల్లిలో 31, గట్టు, రాజోలిలో 2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కూలిన ఇళ్లు

వర్షానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది మట్టి ఇళ్లు కూలిపోయాయి. ఒకరు చనిపోయారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం ఆగారంలో పాలమూరు వెంకటయ్య, కొత్తపల్లిలో జిల్లెల తిరుపతమ్మ, అమరచింతలో ఏసన్న, భాగ్యమ్మ, ఇదే మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో ఒకటి, పాన్‌గల్‌లో కాశీనాథ్ ఇళ్లు కూలిపోయాయి. శ్రీరంగాపురం మండలం తాటి పాములలో ఇల్లు కూలి వడ్డె చం ద్రయ్య(55) చనిపోయాడు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం బిజ్వార్‌లో గోపాల్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం వెన్నచర్లలో వెంటయ్య, బిజినేపల్లి మండలం నంది వడ్డెమాన్‌లో కుందేటి ఆశమ్మ మట్టి ఇళ్లు కూలిపోయాయి.


వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం ఆగారంలో నేలమట్టమైన పాలమూరు వెంకటయ్య ఇల్లు

గ్రామాలకు తెగిన సంబంధాలు

వర్షానికి నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. లోతట్టు ప్రాతాల్లో పత్తి, కంది, వరి పంటలు నీట మునిగాయి. సింగారం వాగు, కోటకొండ పెద్ద చెరువు అలుగు పారుతున్నాయి. భూనేడ్-అభంగాపూర్ మధ్య వాగు ఉధృతంగా పారడంతో కోటకొండ నుంచి అభంగాపూర్, బండగొండ, భూనేడ్, కొత్తపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పాతపల్లి నుంచి ధన్వాడకు వెళ్లే రోడ్డులో వాగు దాటలేక వి ద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఊట్కూర్ మండలం పెద్దజట్రం, అవుసలోనిపల్లి, మల్లేపల్లి, సోమేశ్వర్‌బండ, నాగిరెడ్డిపల్లి గ్రామాల మధ్య వాగుల ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కోస్గి మండలం కడంపల్లి హన్‌పల్లి మధ్య కూడా వాగు ఉధృతితో రాకపోకలు నిలిచాయి. నారాయణపేట మండలం అమ్మిరెడ్డిపల్లి యతన్‌కుంటకు గండిపడటంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పరిశీలించి, గండిని పూడ్చాలని అధికారులను ఆదేశించారు. ఊట్కూర్ మండలం మల్లెపల్లి గ్రామ చెరువు అలుగు పారడంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమేశ్వర్ బండ గ్రామానికి చెందిన వ్యక్తి కారులో మక్తల్ వెళ్తూ, వాగు దాటుతుండగా వాహనం అదుపు తప్పి కొటుకుపోయింది. అటు వైపు నుంచి వస్తున్న గ్రామస్థులు కారులో ఉన్న వారిని బయటికి దింపారు. తర్వాత కారును అతి కష్టం మీద వాగు నుంచి బయటికి తీసుకొచ్చారు.

జూరాలలో 45 గేట్లు ఎత్తివేత

- సంగంబండ, రామన్‌పాడు రిజర్వాయర్ల గేట్ల నుంచి నీటి విడుదల

ధరూరు/మక్తల్ రూరల్/మదనాపురం: భారీ వర్షాలకు జూరాల ప్రాజెక్టుతో పాటు సంగంబండ, రామన్‌పాడు రిజర్వాయర్ల గేట్లను శనివారం ఎత్తారు. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద రావడంతో జూరాల 45 గేట్లను ఎత్తి 3,27,143 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. జలాశయంలో 317.710 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. జెన్‌కో జల విద్యుత్ కేంద్రానికి 19,029 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, నాలుగు యూనిట్ల ద్వారా 136 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ నాలుగు గేట్లను ఎత్తారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.317 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.030 టీఎంసీల ఇన్‌ఫ్లో ఉందని, 4,000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నామని ఏఈ హమీద్ తెలిపారు. మదనాపురం మండలం రామన్‌పాడు రిజర్వాయర్ రెండు గేట్లను ఎత్తి, నీటిని దిగువకు వదులుతున్నారు.


మక్తల్ మండలం సంగంబండ రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు


మదనాపురం మండలం రామన్‌పాడు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు



జాతీయ స్థాయి గో-గేమ్ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31 : బీహార్ రాష్ట్రంలో ఈనెల రెండు నుంచి నాలుగవ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ గో-గేమ్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నసురుల్లా హైదర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ షకీల్‌అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జట్టు వివరాలు వెల్లడించారు.

జట్ల వివరాలు...

సబ్ జూనియర్ బాలురు జట్టు..
మైనొద్దీన్, వర్షిత్, మహ్మద్‌బషీరుద్దీన్

బాలికల జట్టు..
షహనాజ్, హరిక, నిఖిత

జూనియర్ బాలుర జట్టు..
మహ్మద్ రయ్యాన్, రాజేశ్

బాలికల జట్టు..
ప్రశాంతి, షాహిన్

సీనియర్ పురుషుల జట్టు..
ఆదర్శ, దత్త

మహిళ జట్టు..
బుజ్జి, సుమంతి

నిర్మాణంలో నిర్లక్ష్యం

- రెండు బీటీ రోడ్లకు రూ.ఆరు కోట్ల 30 లక్షలు మంజూరు
- పనులకు శ్రీకారం చుట్టిన మాజీ ఎమ్మెల్యే
- సిమెంట్ పనులు మాత్రమే పూర్తి
- ఇబ్బందుల్లో వాహనదారులు
- తమ పరిధిలో లేదన్నట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు

కొత్తకోట, ఆగస్టు 31 : ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా పనులు చేయించడంలో అధికారులు అడుగు ముందుకు వేయడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. గత ప్రభుత్వం జాతీయ రహదారి ముమ్మళపల్లి నుంచి నాటవెల్లి వయా అప్పరాల, రామకృష్ణాపూర్, పామాపురం గ్రామాల మీదుగా బీటీ రోడ్డు నిర్మాణానికి 2022లో రూ. మూడు కోట్ల 90 లక్షలు మంజూరు చేసింది. రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అలాగే జాతీయ రహదారి అమడబాకుల స్టేజీ నుంచి సంకిరెడ్డిపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు చేపట్టేందుకు 2023లో రూ.రెండు కోట్ల 40 లక్షలు విడుదల చేయడంతో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రెండింటిలో ఏ ఒక్క పనికీ గంపెడు తారు పడిన పరిస్థితి లేదంటే అధికారుల తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

గుంతలమయమైన అప్పరాల రోడ్డు

ముమ్మళపల్లి నుంచి రామకృష్ణాపూర్, పామాపురం గ్రామాలకు వెళ్లే అప్పరాల రోడ్డు గుంతలమయం అయింది. ఈ రోడ్డు గుండానే కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి భారీ లోడుతో లారీలు తిరుగుతుంటాయి. అలాగే, ఆత్మకూర్ మండలం తిప్పడంపల్లి, శ్రీరాంనగర్, వీరరాఘవపురం గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. అప్పరాల - రామకృష్ణాపూర్ గ్రామాల మధ్య సిమెంట్ రోడ్డు వేశారు. అధ్వానంగా ఉన్న రోడ్డు వెంట ప్రయాణం చేయడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సులు, లారీల పరిస్థితి ఇందుకు ఏమాత్రం తీసిపోదని డ్రైవర్లు అంటున్నారు.

చినుకులు పడితే చిత్తడవుతున్న సంకిరెడ్డిపల్లి రోడ్డు

సంకిరెడ్డిపల్లి రోడ్డు చినుకులు పడితే చిత్తడవుతోంది. కొత్తకోట, పెబ్బేర్ పట్టణాలకు వెళ్లేవారు ఈ గ్రామ రోడ్డుపైనే రాకపోకలు కొనసాగించాలి. వర్షాకాలం వచ్చిందంటే వాహనదారుల ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పొలం పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు బురద రోడ్డును చూసి ఇంకెంత కాలం ఇబ్బందులు పడాలని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పనులు తీసుకున్న కాంట్రాక్టర్‌తో త్వరగా బీటీ రోడ్డు నిర్మాణం చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మాణ విషయమై బదిలీపై వచ్చిన డీఈ అశోక్‌ను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.


పుల్లారెడ్డి కుంట సమీపంలో గుంతలమయమైన అప్పరాల రోడ్డు


చినుకులకు బురదమయమైన సంకిరెడ్డిపల్లి రోడ్డు

పనులు చేయించడానికి చొరవ తీసుకోవాలి..



గుంతలమయమైన అప్పరాల రోడ్డు నిర్మాణ పనులు చేయించడానికి అధికారులు చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వంలో రోడ్డు పనులకు నిర్లక్ష్యం జరిగిందంటే మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ నిర్మాణ పనులు చేయించడంలో అదే దారిలో నడుస్తున్నట్లు కనపడుతోంది.

- కోటేశ్వర్‌రెడ్డి, అప్పరాల

రోడ్డు వెంట నడువలేక పోతున్నాం..



గుంతలమయమైన మట్టి రోడ్డు వానలకు బురదమయం అవుతోంది. ఈ బురదలో వాహనాలు రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉంటోంది. బీటీ నిర్మాణానికి రూ.రెండు కోట్ల పైచిలుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే బీటీ నిర్మాణం అవుతుందని సంబురపడ్డాం. ఏడాది గడిచినా పని మాత్రం కొనసరంతా కూడా జరగలేదు.

- సంపత్‌కుమార్‌రెడ్డి, సంకిరెడ్డిపల్లి













క్షేత్రం సురక్షితమేనా.?!

- ఉమామహేశ్వరంలో కొండల నుంచి ప్రవహిస్తున్న వరద
- నీటి ఉధృతికి కదులుతున్న బండరాళ్లు
- గతంలో విరిగిపడిన కొండ చరియలు
- భయం మాటున భక్తులు

అచ్చంపేట, ఆగస్టు 31 : నల్లమలలో ఎత్తయిన కొండల్లో కొలువైన ఉమామహేశ్వర స్వామి ఆలయానికి భద్రత ఫైలమా.. అన్న సందేహం కలుగక మానదు. కొన్నేళ్లుగా వాతావరణ మార్పులతో అతివృష్టి, అనావృష్టి కారణంగా కారణంగా అధిక వర్షాలు కురుస్తూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గడచిన మూడేళ్లలో భారీ వర్షాలతో ఉమామహేశ్వర క్షేత్రంలో కొండ చరియలు విరిగిపడడమే కాకుండా భారీ వృక్షాలు సైతం పడిపోయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగుతున్నాయి. ఇక జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో శ్రీశైలం ఉత్తర ముఖ ద్వారమైన ఉమామహేశ్వర దేవాలయం ఒకటి. ఈ ఆలయంలో పరమశివుడు ఉమాదేవీసమేత ఉమా మహేశ్వర స్వామిగా కొలువుదీరి ఉన్నాడు. స్థల పురాణం ప్రకారం శ్రీరాముడు రావణవధ అనంతరం శ్రీశైల ప్రదక్షిణ ఈ క్షేత్రం నుంచే ప్రారంభించినట్లు శ్రీశైల పురాణం చెబుతోంది. కాకతీయుల కాలంలో ఈ క్షేత్ర నిర్మాణం జరిగినట్లు ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి. పార్వతిదేవి శివుడే భర్తగా లభించాలని ఇక్కడ తపస్సు చేయగా ఈశ్వరుడు ప్రత్యక్షమై వరమిచ్చిన ప్రదేశం ఇదని.. అందువల్లనే ఈ క్షేత్రానికి ఉమామహేశ్వరం అనే పేరు వచ్చినట్లు తెలుస్తుంది. ఇంతటి క్షేత్రానికే భద్రత లేదా అన్న సందేహం ప్రస్తుతం కలుగక మానదు. ప్రధానంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఈ ఆలయం ఉండడం విశేషం. అయితే, ఇటీవలి కాలంలో శ్రీశైలం వెళ్లే ప్రధాన మార్గంలోని పాతాళగంగ సమీపంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలు ఉన్నాయి. గతంలో మూడు, నాలుగుసార్లు ఉమామహేశ్వర క్షేత్రంలో కొండ చరియలు విరిగిపడి పెను ప్రమాదం తప్పింది. మూడేళ్ల క్రితం మెట్ల మార్గం సమీపంలోని భారీ వృక్షం నేలకొరగడంతో అప్పుడూ పెద్ద ప్రమాదం తప్పింది. నల్లమల కొండల మధ్య ఉన్న ఈ క్షేత్రాన్ని అన్నివిధాలా అభివృద్ధిపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. క్షేత్ర సమీపంలోని కొండలను పరిశీలించి లూజుగా ఉన్న బండరాళ్లను తొలగించడంతో పాటు, భద్రత కోసం నెట్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకొని యాదాద్రి ఆలయ తరహాలో ఉమామహేశ్వర క్షేత్రాన్ని కూడా మరో శ్రీశైలంలా అభివృద్ధిపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు సూచిస్తున్నారు.



కొండపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



మెట్ల మార్గం నుంచి ప్రవహిస్తున్న వరద



క్షేత్ర సమీపంలో విరిగిపడ్డ చెట్లను తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

ఉమామహేశ్వరానికి భక్తులెవరూ రావొద్దు

అచ్చంపేట, ఆగస్టు 31 : భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా ఉమామహేశ్వర క్షేత్ర దర్శనానికి భక్తులెవరూ రావొద్దని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తుండడం వల్ల ఆలయం వద్ద కొండల పైనుంచి నీటి ప్రవాహం అధికంగా ఉందని, నీరు ప్రవహించే క్రమంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఉమామహేశ్వర ఘాట్ రోడ్డుపై వాహనాలు తిరగడం క్షేమం కాదని, వర్షాలు ముగిసి, నీటి ప్రవాహం తగ్గేవరకు భక్తులెవరూ ఉమామహేశ్వర దర్శనానికి రావొద్దని భక్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతర ఆచరణలో కేకే

- పాలమూరు అధ్యయన వేదిక
- టీఎన్‌జీవోస్‌లో నేడు కేకే స్మారక ఉపన్యాసాలు

పాలమూరు, ఆగస్టు 31 : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అనునిత్యం ఆచరణలో ఉన్న మనిషే కె.కనకాచారి అని కేకే స్మారక ట్రస్టు ప్రతినిధులు ఎం.రాఘవాచారి, కె.వామన్ కుమార్, కె.భీమయ్య, నరసయ్యలు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామిక విలువలు, సమసమాజ ఆలోచనలు గిట్టక కేకేను ఆనాటి ప్రభుత్వం ఆగస్టు 24, 2005న బలి తీసుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోస్ భవనంలో కెకె(కె.కనకాచారి)స్మారక ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మన ఆలోచనలో, ఆచరణలో కేకే సజీవంగా వెలుగుతున్నాడన్నారు. కేకే మెమోరియల్ ట్రస్టు ఆయన జీవించిన విలువల వెలుగులో ఈ కాలమంతా సామాజిక, రాజకీయార్థిక చలనాన్ని, వర్తమాన సంచాలనాలను ప్రజాస్వామిక పద్ధతుల్లో చర్చకు పెడుతోందన్నారు. ఈ సంవత్సరం భారత జాతీయోద్యమంలో ముస్లింల పాత్రను, కేంద్రం తెచ్చిన నూతన న్యాయ చట్టాల పర్యావసనాలను చర్చించేందుకు గాను ఈ ఉపన్యాసాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు సభకు ముఖ్య అతిథులుగా జహారా, ఖలీదా పర్వీన్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ఎన్.వేణుగోపాల్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. మనం ఏమీ తెలుసుకోకుండా, పరివర్తన చెందకుండా అసలేమీ సాధించలేమన్నారు. అభ్యుదయవాదులు, ప్రజాసంఘాల నాయకులు సభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

బైకు అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, ఆగస్టు 31 : బైకు అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని మర్రికుంట గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెబ్బేరు మండల కేంద్రానికి చెందిన బుడగ జంగాల శేఖర్ తాను నివాసముండే గుడిసెకు కవర్ కప్పేందుకు కవర్ కోసం వనపర్తికి వచ్చాడు. వనపర్తిలో కవర్ తీసుకొని పెబ్బేరుకు తిరుగు ప్రయాణం అయ్యాడు. మర్రికుంట శివారు మెడికల్ కాలేజీ సమీపంలోకి రాగానే బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రున్ని జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై రూరల్ ఎస్సై జలంధర్‌రెడ్డిని వివరణ కోరగా ఇప్పటివరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న బైక్

- యువకుడి దుర్మరణం

యాచారం, ఆగస్టు 31 : ఓ పక్క ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం, వర్షం కురుస్తున్నా హెల్మెట్ లేకుండా అతివేగంతో ముందున్న లారీని గమనించకుండా బైక్ నడిపి దుర్మరణం చెందిన యువకుడి ఉదంతం శనివారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు యాచారం మండలం చౌదర్‌పల్లి గేటు వద్ద జరిగింది.

వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పు నుంతల మండల కేంద్రానికి చెందిన లలిత, కృష్ణయ్య దంపతుల ఏకైక కుమారుడు శివ(22) ఇబ్రహీంపట్నంలోని శ్రీదత్త ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా శుక్రవారం ఉదయం నల్గొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలోని తన మిత్రుడి ఇంట్లో బోనాల ఉత్సవాలకు తన మరో మిత్రుడు తేజతో కలిసి బైక్‌పై వెళ్లారు. బోనాల ఉత్సవాలు ముగిసిన అనంతరం భోజనం చేసి బైక్‌పై ఇద్దరు యువకులు ఇబ్రహీంపట్నం బయల్దేరారు. చౌదర్‌పల్లి గేటు సమీపంలో పెట్రోల్ బంకు వద్ద డీజిల్ లేక పది టైర్ల లారీ ఆగిపోయింది. వర్షం కురుస్తుండడంతో బైక్ నడుపుతున్న శివ లారీని గమనించకుండా అతివేగంతో బైక్ నడిపి ముందున్న లారీని వెనక నుంచి బలంగా ఢీకొట్టాడు. దాంతో అతని తల పగిలి అక్కడికక్కడే దుర్మరణం చెందగా బైక్ వెనక ఉన్న తేజకు తీవ్ర గాయాలు కావడంతో పెట్రో మొబైల్–1 పోలీసులు అతన్ని చికిత్స కోసం ఇబ్రహీంపట్నం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

గద్వాల న్యూటౌన్, ఆగస్టు 31 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి అధికారులను ఆదేశించారు. శనివారం జోగుళాంబ గద్వాల ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ అధికారి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీలు జరగకుండా బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. భూసమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి జవాబుదారీతనంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ పక్కాగా నమోదు చేయాలని, తప్పుడు కేసులు ఉంటే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పరిహార విషయంలో బాధితులకు పూర్తి సహకారం అందించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 118 పెండింగ్ కేసులు ఉన్నాయని, వీటిని తక్షణమే పరిష్కరించడానికి సంబంధిత శాఖలు సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తామని, వచ్చిన ప్రతీ పిటీషన్‌ను రిజిస్టర్ చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో కూడా పిటీషన్ తీసుకుంటున్నామన్నారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను వేగంగా పరిష్కరిస్తామని, ప్రజలకు ప్రభుత్వం తరుపున తోడుగా ఉండి న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, డీఎస్పీ సత్యనారాయణ, ఇన్‌చార్జి బీసీ డెవలప్‌మెంట్ అధికారి సరోజ, జిల్లా అధికారులు ఉన్నారు.

బాధితులకు ప్రభుత్వ సహకారం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ఎల్లవేళలా నిరంతర కృషి చేస్తుందని ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. ఐడీవోసీలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ రివ్యూపై ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు మూడు కేటగిరీలుగా విభజించామని, కేసు తీవ్రతను బట్టి కేటగిరీల ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.ఎనిమిది లక్షల వరకు ఉంటుందన్నారు. ప్రతీ నెల చివరి శనివారం గ్రామాల్లో సివిల్ రైట్స్‌డే నిర్వహిస్తున్నామని అందులో తహసీల్దార్, ఎస్‌హెచ్‌వో అధికారులు పాల్గొని ప్రజలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం కలెక్టర్ రివ్యూ సమావేశంలో చర్చించిన అంశాలను మీడియాకు వివరించారు. 2023 సెప్టెంబరు నుంచి 2024 జూన్ వరకు 27 కేసులు నమోదు అయ్యాయన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు.

మల్లు రవికి ఘన స్వాగతం

గద్వాల : గద్వాలలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ డాక్టర్ మల్లురవికి శనివారం ఘన స్వాగతం లభించింది. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ సరిత, కాంగ్రెస్ నాయకులు ఆయనకు జమ్మిచేడు స్టేజీలో స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందించారు. శాలువాతో సత్కరించారు. వర్షం కురుస్తున్నప్పటికీ పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు అక్కడికి చేరుకొని ఆయనకు స్వాగతం పలికారు.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

- కలుషిత నీటిని వదులుతున్న పరిశ్రమ ముందు కాంగ్రెస్ బైఠాయింపు
- నీటిని పరిశీలించిన నాయకులు

రాజాపూర్, ఆగస్టు 31 : కలుషిత నీటిని వదులుతున్న మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని పలు పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలోని పల్లే చెరువులోకి, రాయపల్లి గ్రామంలో ఉన్న చెరువులకు పోలేపల్లి సెజ్‌లో ఉన్న అరబిందో పరిశ్రమ, అమీనల్ పరిశ్రమలతో పాటు, పలు పరిశ్రమలు వర్షం పడిన సమయంలో కలుషిత నీటిని వదులుతున్నారని వారు పేర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి ఆయా పరిశ్రమల నుంచి వదిలిన కలుషిత నీటిని నాయకులు పరిశీలించారు. అనంతరం అరబిందో పరిశ్రమ ముందు కొద్దిసేపు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల నుంచి వదులుతున్న కలుషిత నీటితో రాయపల్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ పొలాలు, చెరువుల్లో ఉన్న చేపలు, భూగర్భజలం కలుషితమై రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి కలుషిత నీటిని చెరువులు, పొలాలకు వదిలితే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, నరహరి, గోనెల రమేష్, రమణ, గోవర్ధన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ఫార్మా పరిశ్రమల నుంచి వర్షపు నీటితో పాటు వదులుతున్న కలుషిత నీటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భయాందోళనలో బొమ్మరాజుపల్లి రైతులు

ఊర్కొండ, ఆగస్టు 31 : గుర్తు తెలియని అడవి జంతువుల దాడిలో లేగదూడలు, మేకలు మృతి చెందుతుండటంతో నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం బొమ్మరాజుపల్లి రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గత వారం నుంచి బొమ్మరాజుపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని అడవి జంతువులు సంచరిస్తూ లేగదూడలు, మేకలపై దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. దాడిలో జీవాల మృతితో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వారం క్రితం గ్రామ శివారులోని షెడ్డులో ఉన్న మేకలపై దాడి చేయగా 13 మేకలు, ఐదు లేగదూడలు మృతి చెందాయన్నారు. నాటి నుంచి నేటివరకు ఎక్కడో ఓ చోట లేగదూడలు, మేకలపై దాడి చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాంతో రైతులు ఇంటి వద్దనే రాత్రిళ్లు పశువులను, మేకలను ఉంచుకుంటున్నారు. ఇంటి వద్ద స్థలాలు లేని రైతులు వ్యవసాయ భూముల వద్ద పశువులను ఉంచి అక్కడే వాటికి రక్షణగా ఉంటున్నారు. అలా ఉంటున్నప్పటికీ అడవి జంతువులు దాడి చేస్తుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. దాంతో అటవీ శాఖ అధికారులు శనివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి రైతులు పశువుల పాకల వద్ద రక్షణగా ఉండి శనివారం తెల్లవారుజామున ఈదమయ్య అనే రైతు ఇంటికి రాగా దొడ్డిలో ఉన్న లేగదూడపై అడవి జంతువు దాడి చేసిందని, దాడిలో దూడ మృతిచెందిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అడవి జంతువుల దాడితో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోననే భయంతో కంటిమీద కునుకు లేకుండా పోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తమ పశువులను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



బొమ్మరాజుపల్లి శివారులో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

ఫిర్యాదులు వచ్చాయి : వెంకటరమణమ్మ, ఫారెస్టు బీట్ ఆఫీసర్

బొమ్మరాజుపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని అడవి జంతువుల దాడిలో వారం రోజులుగా ఎక్కడో ఓ చోట లేగదూడలు, మేకలపై దాడి చేస్తున్నాయని పలు ఫిర్యాదులు వచ్చాయి. దాంతో సంఘటన స్థలాలను పరిశీలించాం. రైతులు తెలియజేసిన సమాచారంతో పాటు పాదముద్రల ద్వారా హైనాలుగా అనుమానం ఉంది. వాటిని గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కెమెరాలు ఏర్పాటు చేసిన చోట కాకుండా ఆదివారం తెల్లవారుజామున మరోచోట దాడి చేసి లేగదూడను చంపింది. ఉన్నతాధికారులకు సమాచారం అందించి తగు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు అప్రమత్తంగా, ధైర్యంగా ఉండాలని సూచిస్తున్నాం.

మన్యంకొండకు తరలివచ్చిన భక్తులు

- శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో ఆలయంలో పెరిగిన రద్దీ



స్వామివారి దర్శనం కోసం క్యూలో నిలిచి ఉన్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్, ఆగస్టు 31 : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో అర్చకులు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు సామూహిక వ్రతాలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ వేద మంత్రోచ్ఛరణాల మధ్య భక్తులు వ్రతాలు నిర్వహించారు. భారీ వర్షంలో కూడా భక్తులు స్వామివారికి దాసంగాలను సమర్పించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీ సేవలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట

- డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 31 : రైతుల సంక్షేమం, అభివృద్ధికి డీసీసీబీ పెద్దపీట వేస్తుందని మహబూబ్‌నగర్ డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని డీసీసీబీని శనివారం ఆయన సందర్శించారు. డీసీసీబీ సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఛైర్మన్ మాట్లాడారు. కల్వకుర్తి పీఏసీఎస్ ఛైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి కోరిక మేరకు రుణమాఫీ జరిగిన రైతులందరికీ డీసీసీబీలో రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీఏసీఎస్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. బ్యాంకు సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతూ రైతులకు సేవలందించాలని ఆదేశించారు. మొదటిసారిగా కల్వకుర్తికి వచ్చిన డీసీసీబీ ఛైర్మన్‌ను పలువురు పీఏసీఎస్ ఛైర్మన్లు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, పీఏసీఎస్ ఛైర్మన్లు తలసాని జనార్దన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గురువయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ మేనేజర్ రమాకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈవోలు వెంకట్‌రెడ్డి, విష్ణుమూర్తి, శ్రీనివాసులు, వెంకటయ్య, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

యువకుల మృతితో గ్రామంలో మద్యపాన నిషేధం

- మెయిన్‌రోడ్డుపై మాంసాహార దుకాణాలు మూసివేతకూ నిర్ణయం
- అమలు చేయాలని తీర్మానం



గ్రామంలో మద్యపాన నిషేధం అమలు చేయాలని తీర్మానం చేసిన కాపీని పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న గ్రామస్థులు

పెద్దమందడి, ఆగస్టు 31 : యువకుల మృతితో గ్రామంలో మద్యపాన నిషేధం విధించిన ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. పామిరెడ్డిపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గ్రామ యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. యువకుల మృతికి మద్యపానం కారణమంటూ పేర్కొన్న గ్రామస్థులు గ్రామంలో మద్యపాన నిషేధం అమలుకు తీర్మానం చేశారు. తీర్మాన కాపీని శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అలాగే, మెయిన్ రోడ్డుకిరువైపులా మాంసాహార దుకాణాలను కూడా పూర్తిగా ఎత్తివేసి గ్రామం లోపల ఎక్కడైనా ఏర్పాటు చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. అలాగే బొగ్గులపై మాంసాన్ని కాల్చే విధానాన్ని తీర్మానంలో పొందుపర్చారు. తీర్మానానికి కట్టుబడి ఉండాలని గ్రామస్థులు ప్రతిజ్ఞ చేశారు.

బొటానికల్ గార్డెన్‌ను సందర్శించిన బీట్ అధికారులు



శిక్షణ పొందుతున్న అటవీశాఖ బీట్ అధికారులకు బొటానికల్ గార్డెన్‌లో మొక్కల గురించి వివరిస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, ఆగస్టు 31 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను శనివారం శిక్షణ పొందుతున్న అటవీశాఖ బీట్ అధికారులు సందర్శించారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 35వ బ్యాచ్‌కు చెందిన 33 మంది బీట్ అధి కారులు బొటానికల్ గార్డెన్‌లోని వివిధ రకాల మొక్కలను పరిశీలించారు. ఆయా మొక్కల గురించి గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య వివరించారు. అలాగే కళాశాలలోని బయోడైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కేంద్రం, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన హెర్బేరియంను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద, శిక్షణాధికారుల సమన్వయకర్త రాంమోహన్‌లతో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి
- ప్రారంభమైన ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలు



పరీక్షలను పరిశీలిస్తున్న పీయూ రిజిస్ట్రార్

పాలమూరు యూనివర్సిటీ, ఆగస్టు 31 : మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి విద్యార్థులను హెచ్చరించారు. శనివారం పాలమూరు యూనివర్సిటీ, అనుబంధంగా ఉన్న ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఫార్మసీ ఆరవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెంటర్‌లో జరుగుతున్న పరీక్షలను పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నూర్జహాన్‌బేగం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రార్ అధికారులకు సూచించారు.

పీయూలో గ్యాలరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన

పాలమూరు యూనివర్సిటీ స్పోర్ట్స్ విభాగంలో రూ.4.4 కోట్లతో నిర్మించిన 400 మీటర్ల సింథటిక్ ట్రాక్ గ్యాలరీ గదుల నిర్మాణానికి శనివారం పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, పీయూ అధికారులు కాంట్రాక్టర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రవీందర్, ఫైనాన్స్ ఆఫీసర్ బాలకృష్ణ తదితరులున్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలు, అధికారులకు కలెక్టర్ విజయేందిర బోయి సూచన


కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఆగస్టు 31 : జిల్లాలో ఎడ తెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఇటు ప్రజలు, అటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. రానున్న రెండు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి వర్ష ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలంటూ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. మట్టి మిద్దెలు, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరూ నివాసం ఉండవద్దని, అలాంటి ఇళ్లపై మునిసిపల్, గ్రామ పంచాయతీ అధికారులకు ముందే తెలియజేస్తే అవసరమైతే తక్షణమే వసతి కల్పిస్తామని తెలిపారు. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వాగులలోకి ఎవరూ వెళ్లొదని సూచించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా వ్యాధులకుగురైన వారికి తక్షణ చికిత్స అందేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులు అందరు జిల్లా యంత్రాంగానికి అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ కార్యస్థానం విడిచి వెళ్లవద్దని ఆదేశించారు.

మరో రెండ్రోజులు భారీ వర్షాలు

- అత్యసరమైతేనే బయటకు రావాలని పురపాలక శాఖ విజ్ఞప్తి

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 : పాలమూరు జిల్లాలో మరో రెండ్రోజులు భారీనుంచి అతిభారీ వర్షాలు ఉన్నాయని, ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని పాలమూరు పురపాలికశాఖ చైర్మన్, కమిషనర్ ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలున్నట్లు భారత వాతావరణ శాఖ వారు ఈనెల 2 ఉదయం 8:30 గంటల వరకు భారీ వర్షాలున్నందున ప్రజలు బయటకు రావద్దని సూచించించారని అన్నారు. ప్రజలు ఎవరైనా శిథిలావస్థలో ఉన్నటువంటి ఇండ్లు, భవనాలు ఉంటే వాటిని వెంటనే ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, లేదంటే పురపాలిక శాఖ పునరావాస కేంద్రాలను ఆశ్రయించాలని కోరారు. హెల్ప్‌లైన్ నెంబర్ 7093911352ను సంప్రదించాలని కోరారు.

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి

గండీడ్, ఆగస్టు 31 : అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక లోపాలతో ఆలస్యమవుతున్నదని, ప్రతీ రైతుకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని, ఎవ్వరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మహమ్మదాబాద్ మండల అధ్యక్షుడు కె.ఎం. నారాయణ, పరిగి ఇన్‌చార్జీ నరసింహారావు, ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి పనీష, వైద్యాధికారి చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ అధికారులకు సన్మానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 : పోలీసుశాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను శనివారం ఎస్పీ జానకి తన కార్యాలయంలో సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్‌ఐ రంగయ్య, భూత్పూర్ పోలీస్ స్టేషన్ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణలను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవనం గడపాలని ఎస్పీ కోరారు. కాగా ఆర్మ్‌డ్ రిజర్వ్‌పోలీస్ నందు ఏడాదినుంచి విధులు నిర్వర్తిస్తున్న ఆర్‌ఐ శ్రీను నల్గొండకు బదిలీ అయి రిలీవ్ అయినందున ఆయననూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీసీఆర్‌బి డీఎస్పీ రమణారెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఈ రుక్మిణీబాయి పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించాలి

- జిల్లా వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ బాలరాజు

మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 31 : జిల్లాలో ఫుడ్ సేఫ్టీ అధికారి లేక పట్టణంలో జిల్లాలో హోటళ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయని జిల్లా వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ బాలరాజు ఆరోపించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన పదార్థాలు వడ్డించి వినియోదదారుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఫుడ్ సెఫ్టీ అధికారిని నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాగరాజు, రాజసింహుడు కృష్ణ పాల్గొన్నారు.

కొనగట్టుపల్లిలో వైద్య శిబిరం

హన్వాడ, ఆగస్టు 31 : మండలంలోని కొనగట్టుపల్లి గ్రామంలో వైద్య శాఖ హెల్త్ క్యాంపు నిర్వహించి, ఇంటింటి జ్వర సర్వే చేపట్టారు. రెండు రోజుల క్రితం గ్రామంలో క్యాంప్ నిర్వహించి ఇంటింటి సర్వే చేశారు. ప్రజలకు మృతుని కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. ఈనెల 28న అతిసారతో గొల్ల వెంకటయ్య మృతిచెందిన వార్త 'ఆంధ్రజ్యోతి'లో రాగా అధికారులు స్పందించారు. అయితే, ఆగస్టు 27న కొనగట్టుపల్లి గ్రామంలో గొల్ల వెంకటయ్య వాంతులు, విరేచనాలతో చనిపోయాడని, అతిసారతో చనిపోలేదని వైద్యఅధికారులు తెలిపారు. గ్రామంలో ఎవరికీ అతిసార లక్షణాలు లేవని వైద్యాధికారులు వివరణ ఇచ్చారు.

నేడు ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 : సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు టీజీఈజేఏసీ నాయకులు, తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శి రమాకాంత్ శనివారం ఒక సంయక్త ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ట్రస్మా నాయకులు



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 : తెలంగాణ ఉద్యమకారుడు, ఎమ్మెల్సీ కోదండరాంను శనివారం హైదరాబాద్‌లో మహబూబ్‌నగర్ జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి అంజిరెడిడ్డి, వర్కింగ్ ప్రసిడెంట్ హిరేకారి రామ్‌చందర్‌జీ తదితరులు కలిశారు. హైదరాబా ద్‌లో ప్రైవేట్ పాఠశాల యజమానుల సమావేశం జరగగా వీరు పాల్గొని కోదండరాంను కలిసి ప్రైవేట్ పాఠశాలల సమస్యలు వివరించారు. ప్రైవేట్ స్కూళ్ల సమస్యలపైన అన్ని రకాలుగా ఉండగా ఉంటానని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. అనంతరం ప్రైవేట్ పాఠశాల నాయకులు ఎమ్మెల్సీని పూల మాల శాలువాతో సన్మానించారు.

వసతి గృహం ఆకస్మిక తనిఖీ

మిడ్జిల్, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శనివారం రాత్రి తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతాంజలితో పాటు పలువురు అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థుల పరిస్థితి, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఎస్సీ బాలికల వసతి గృహంలో భోజనం చేశారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో 3 గదులలో వర్షం నీరు లీకేజీ అవుతున్న విషయం గమనించిన అధికారులు వెంటనే గదులను మూసివేయాలని వార్డెన్‌ను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు అందిస్తున్న భోజనం సక్రమంగా లేదని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ యశోద, పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి


లక్ష్మారెడ్డి (ఫైల్)

దేవరకద్ర, ఆగస్టు 31 : రెండు బైక్‌లు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గోప్లాపూర్ దగ్గర చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగన్న వివరాల ప్రకారం.. చిన్నచింత కుంట మండలం బండ్రవల్లికి చెందిన లక్ష్మారెడ్డి(47) శనివారం సాయంత్రం దేవరకద్ర నుంచి బైక్‌పై తన గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టింది. లక్ష్మారెడ్డి బైక్‌పై నుంచి కిందపడగా మరో వాహనం అతని కాలిపై నుంచి వెళ్లిపోయింది. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెం దాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చ్యూకి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రాజాపూర్ : నందిగామ గ్రామంలో వర్షం నీటిలో మునిగిన వరి పంటను చూపుతున్న రైతు


కోయిలకొండ : ఉధృతంగా ప్రవహిస్తున్న అంకిళ్ల పెద్దవాగు


చిన్నచింతకుంట శివారులో మద్దూరు చెరువుకాలువకు గండిపడగా, నీట మునిగిన వరిపైరు

దంచికొట్టిన వాన

- జడ్చర్ల ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలోకి చేరిన వర్షం నీరు
- ఇబ్బందులకు గురైన రోగులు
- జిల్లాలో మత్తడి దూకిన పలు చెరువులు, కుంటలు
- సహాయ చర్యలు చేపట్టిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జడ్చర్ల, ఆగస్టు 31 : జిల్లాలో వాన దంచికొట్టింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వాన శనివారం అంతా ఎడతెరిపి లేకుండా కురిసింది.

జడ్చర్ల పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. జడ్చర్ల ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో వర్షం నీరు సుమారు ఫీటు మేర వచ్చి చేరడంతో ఆసుపత్రిలోకి వెళ్లేందుకు రోగులు, చికిత్సల కోసం వచ్చిన వారంతా ఇబ్బందులకు గురయ్యారు. ఆసుపత్రి ప్రాంగణంలోకి వర్షం నీరు చేరడంతో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రాజయ్య, కౌన్సిలర్ సతీష్‌లు చేరుకుని వర్షం నీటిని తొలగించే ప్రక్రియను చేపట్టారు. నసరుల్లాబాద్ చెరువు, మర్రిచెట్టుతండా సమీపంలోని పెద్దాయకుంట చెరువు నిండి అలుగు పారింది. దుందుబీనది పారుతోంది.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

హన్వాడ : వర్షానికి మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. గుడిమల్కాపూర్ గ్రామంలో రైతులు తాడు సహాయంతో వాగు దాటారు. మండలంలో అతి పెద్ద చెరువు అయిన ఇబ్రహీంబాద్ హేమ సముద్రం చెరువు నిండింది. వేపూర్, మునిమోక్షం, నాయినోనిపల్లి టంకర గ్రామాలలో చెరువులు అలుగు పారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. హేమసముద్రం చెరువును తహసీల్దార్ కిష్టానాయక్ పరిశీలించారు.

ముసురు వర్షం

దేవరకద్ర : నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లోని గ్రామాల్లో ముసురు వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. నాగారం గ్రామంలో వర్షానికి గొల్ల కృష్ణయ్య ఇల్లు కూలిపడిపోయింది. చెరవులు, కుంటల్లో వర్షం నీరు చేరింది. కౌకుంట్ల- ఇస్రంపల్లి బ్రిడ్జిపై వర్షపు నీరు చేరి ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో తహసీల్దార్ ఎల్లయ్య పర్యవేక్షించి, ఎవరూ వెళ్లకుండా కంపను వేయించారు. దేవరకద్ర మండలంలోని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు.

అలుగు పారుతున్న చెరువులు

అడ్డాకుల : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తడంతో చెరువులు, కుంటలకు జలకళ వచ్చింది. ఒకవైపు కందూరు, గౌరిదేవిపల్లి, రాచాల దగ్గర పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు నిండుకుండలా మారాయి. శాఖాపూర్ పెద్దచెరువు అలుగుపారుతుండడంతో జాతీయ రహదారిపై వెళ్లే వాహన చోదకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. అడ్డాకుల పెద్దచెరువు కూఢ అలుగు పారేందుకు సిద్ధంగా ఉంది. ఒకవైపు వాగు తీవ్రరూపం దాల్చడంతో వర్నెవాగుపై ఉన్న మట్టిరోడ్డు కొట్టుకుపోయి వర్నె, ముత్యాలంపల్లి, పేరూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని గ్రామాలలో శిథిలమైన మట్టి ఇళ్లు కూలిపోయాయి.

వర్నె వాగును పరిశీలించిన కలెక్టర్

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని వర్నెవాగుపై నిర్మించిన మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో శనివారం కలెక్టర్ విజయేందిరబోయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉధృతంగా పారుతున్న వాగుకు ఇరువైపులా బారికేడ్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. అంతకు ముందు అలుగుపారుతున్న శాఖాపూర్ పెద్ద చెరువును పరిశీలించారు.


దేవరకద్ర : ఇస్రంపల్లి బ్రిడ్జిపై నీరు పారుతుండడంతో రహదారిపై కంప వేయించిన తహసీల్దార్ ఎల్లయ్య

పారుతున్న చెక్‌డ్యాం

రాజాపూర్ : మండలంలోని దుందభీ వాగులోకి వర్షపు నీరు చేరుతుండడంతో మల్లేపల్లి, నందిగామ గ్రామాల మధ్యలో ఉన్న చెక్ డ్యాంలు జలకలను సంతరించుకున్నాయి. నందిగామ గ్రామంలో కొందరి రైతుల వరి పంటలు నీటిలో మునిగాయి.

కుంటల్లోకి నీరు

నవాబ్‌పేట : వానకు మండలంలోని వివిధ గ్రామాల్లోని కుంటలు చెరువుల్లో వర్షపు నీరు చేరుతోంది. నవాబ్‌పేట- కొందుర్గు మండలాల సరిహద్దు మధ్యలో ఉన్న వెంకిర్యాల వాగునుంచి భారీగా వరద నీరు వెళ్తుండటంతో రెండు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని తహసీల్దార్ నాన్యనాయక్ కోరారు. యన్మనగండ్ల వసతిగృహంలోకి వర్షపు వచ్చి చేరింది.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

మిడ్జిల్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజునాయక్ సూచించారు. కొత్తూరు, వెలుగొమ్ముల, మిడ్జిల్, కొత్తపల్లి, చిలువేరు, వస్పుల, అయ్యవారిపల్లి గ్రామాలలోని పారుతున్న వాగుల నుంచి ప్రజలు దాటకుండా రోడ్డుకు అడ్డంగా రెవెన్యూ సిబ్బందితో ముళ్లకంపను అడ్డంగా వేయించారు. మండలంలో 40.8 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

పారుతున్న పెద్ద వాగు

కోయిలకొండ : వానకు మండలంలోని అంకిళ్ల పెద్దవాగు, ఆచార్యపూర్ మధ్యల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో కోయిల్‌సాగర్‌కు భారీ స్థాయిలో నీరు చేరుతోంది.

ఎడతెరపిలేని వర్షం

చిన్నచింతకుంట : కుండపోతవర్షంతో వాగులు, వంపులు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని ప్రధానమైన ఊకచెట్టువాగు నిండుగా పారుతోంది. బండర్‌పల్లి చెక్‌డ్యాం మత్తడి దుంకుతోంది. పర్దిపూర్ రిజర్వాయర్ అలుగుపారుతోంది. పెద్దవడ్డెమాన్, చిన్నవడ్డెమాన్, ఏదులాపూర్, చిన్నచింతకుంట, కురుమూర్తి గ్రామాల శివారులోని ఊకచెట్టు వాగులోకి భారీగా వాగు ఉధృతంగా పారుతున్నది. ఇక పర్దీపూర్ రిజర్వాయర్ అలుగునుంచి వచ్చే కాలువనీటితో పెద్దవడ్డెమాన్ గ్రామ సమీపంలోని దమాగ్నాపూర్, పెద్దవడ్డెమాన్ గ్రామాలకు శనివారం ఉదయం నుంచే రాకపోకలు పూర్తిగా నలిచిపోయాయి. ఎస్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకొని, రోడ్డుకు అడ్డంగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే దమాగ్నాపూర్, సీతారాంపేట గ్రామాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. చిన్నచింతకుంట చెరువుకు వరద ధాటికి కాలువకు గండి పడింది. దిగువనున్న చిన్నచింతకుంటకు చెందిన కుమ్మరి చంద్రన్న, ఇతర రైతులకు సంబంధించి దాదాపు 20 ఎకరాల్లో వరి, మరో 20 ఎకరాల్లో పత్తి పంటలు నీటమునిగాయి. మండల కేంద్రంలోని ఇళ్ల మధ్యకు చెరువునీరు ప్రవహించటంతో సమీపంలోని ఇళ్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముచ్చింతల గొలుసుకట్టు కాలువకు కూడా గండి పడింది.

భూత్పూర్‌లో భారీ వర్షం

భూత్పూర్ : ఎడతెరిపి లేని వర్షానికి మండలంలో 61మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చాలా గ్రామాల్లో చెరువులు, కుంటలు పొంగి పారాయి. అదే విధంగా పోతుమడుగు శివారులో ఉన్న వాగు ఉప్పొంగి పారుతోంది. రావులపల్లి వాగుకింద ఉన్న చెక్‌డ్యాం నిండి పారుతున్నందున ప్రజలు వచ్చి చూసిపోతున్నారు. తహసీల్దార్ పులిరాజు, ఎంపీడీవో ప్రభాకర్, ఎస్‌ఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. మండలంలోని పోతులమడుగు, గోపన్నపల్లి, ముత్యాలంపల్లి వాగుల వద్ద ప్రజలకు వాగు దాటించేందుకు కాపలా ఉన్నారు.

పారుతున్న వాగులు

మహమ్మదాబాద్ : వర్షానికి మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండల పరిధిలో తాందూర్- మహబూబ్‌నగర్ ప్రధాన రహదారికి పక్కనే ఉన్న భావనల చెరువు అలుగు పారడంతో ప్రధాన రహదారిపై నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది కల్గకుండా చర్యలు తీసుకున్నారు.


నవాబ్‌పేట : పారుతునన వెంకిర్యాల వాగు


హన్వాడ : హేమ సముద్రం చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్


అడ్డాకుల పెద్దచెరువును పరిశీలిస్తున్న రైతులు


మిడ్జిల్ : వాగు వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన ముళ్లకంప

కాంగ్రెస్ నాయకులు .. నోరు అదుపులో పెట్టుకోండి

- పేదల ఇళ్లను కూల్చి మాజీమంత్రిపై వ్యక్తిగత విమర్శలు చేయడం దారుణం
- బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 : పేదల ఇళ్లను కూల్చివేసి, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆయన తమ్ముడిని టార్గెట్ చేస్తూ ఇష్టానుసారంగా మాట్లాడటం కాంగ్రెస్ నాయకులకు తగదని, నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. పాలమూరు ప్రజల ఆశీస్సులతో శ్రీనివాస్‌గౌడ్ పదేళ్ల పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఇది వరకు ఎవరూ చేయని అభివృద్ధి పనులు చేశారని అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ మునిసిపల్ చైర్మన్ కోరమోని నర్సింహులు, నాయకులు జములప్ప, అనంతరెడ్డి, శివరాజు మాట్లాడారు. 523 సర్వేనెంబర్‌లో గతంలో కాంగ్రెస్ పార్టీవారే పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు నిర్మించుకున్న ఇళ్లను వారే కూల్చివేసి వికలాంగులను రోడ్డుపాలు చేశారని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. ఇళ్ళను కోల్పోయిన బాధితులకు మాజీమంత్రి ఆధ్వర్యంలో టిఫిన్, భోజన వసతి ఏర్పాటుచేసి, అండగా నిలబడితే కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, ఆనంద్‌గౌడ్‌లు వ్యంగ్యంగా మాట్లాడటమే కాకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని, ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. దొంగపట్టాలని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు వాళ్ళపై విచారణ చేసి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఓ నాయకుడు గట్టిగా మాట్లాడితే పదవి వస్తుందని ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, మరో నాయకుడు అవకాశాల కోసం పార్టీ మారి విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా తమ నాయకుడిపై విమర్శలు మాని ఇండ్లు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయాలని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్న సంగతి గుర్తించుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు తాటిగణేష్, పోతుల గిరిధర్‌రెడ్డి, నవకాంత్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిలీ పట్టాలిచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

-13 మందిపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 : క్రిస్టియన్‌పల్లి 523లో అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ పట్టాలు తయారు చేసి పేదలకు సొమ్ము చేసుకున్న వ్యక్తులపై విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు అధికారులకు విన్నవించారు. శనివారం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి వినోద్‌కుమార్, కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిర బోయిని కలిశారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జానకిని కలిసి ఆమెకు వినతి పత్రం అందజేశారు. 523 సర్వే నెంబర్‌లో బీఆర్ఎస్ హయాంలో నాయకుల అండదండలతో వారి అనుచరులు ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నం చేశారని కలెక్టర్‌కు వివరించారు. ఫోర్జరీ సంతకాలతో పట్టాలు తయారుచేసి ఇవే నిజమైనవని కొందరికి వాటిని అందజేసి డబ్బులు కాజేశారని నాయకులు ఆరోపించారు.

మొత్తం 13 మంది పేర్లను లిఖిత పూర్వకంగా రాసి కలెక్టర్, ఎస్పీలకు అందజేశారు. రాయుడు, రంగదాస్, దేవ, ఎల్లప్ప, చెన్నకేశవులు, ఖనాపూర్ శంకర్, బక్క వెంకటేశ్, అడ్డాకుల శంకర్, సుభాష్, ఇలియాస్, డాక్యానాయక్, ఆంధ్రా రాజు, రామాంజనేయులుపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వీరంతా ప్రభుత్వ భూమిని ఆక్రమించడంతో పాటు అనేకమంది అమాయక ప్రజలను మోసం చేసి వారి నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారన్నారు. వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడటంతో పాటు మోసపోయిన వారికి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, షబ్బీర్ అహ్మద్ పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

- శిక్షణ ఉపాధ్యాయులను అభినందించిన హెచ్ఎం

భూత్పూర్, ఆగస్టు 31 : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, గురువుకు ఉన్న విలువ వెలకట్టలేనిదని పాలమూరు యూనివర్సిటీ టీచింగ్ రికార్డు స్క్వాడ్ (తనిఖీబృందం) అధికారులు విశ్వనాథం, బుర్రన్న, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూత్పూర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆనందమ్మ అన్నారు. శనివారం వారు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బీఎడ్ పూర్తి చేసి ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయుల చివరి రోజు రికార్డు పరిశీలన కార్యక్రమానికి హాజరైన పాలమూరు యూనివర్సిటీ బృందం అధికారుల హాజరై పరిశీలించారు. అనతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. రేపటి రోజు ఉపాధ్యాయులుగా వస్తే విద్యార్థులకు గుణాత్మకమైన, విలువతో కూడిన విద్యను బోధించాలన్నారు. అధ్యాపకుల బృందం బాలవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌సింగ్, ఉపాధ్యాయులు బోరు కృష్ణయ్య, పుష్పలత, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంజన్న జల్దిబిందె ఉత్సవం

-ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే పర్ణికారెడ్డి


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

కోయిలకొండ, ఆగస్టు 31 : శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ ఆది ఆంజనేయ స్వామి జల్దీ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంవరకు పల్లకి సేవనిర్వహించి శ్రీరామకొండ వద్ద మహిమాన్వితమైన బావిలో జల్దీబిందెకు పూజలు నిర్వహించి అభిషేకం, అర్చన జరిపించారు. కార్యక్రమంలో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మెడికల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ టౌన్ : మహబూబ్‌నగర్ పట్టణంలోని సుభాష్ నగర్‌లోని సత్యమన్న వ్యాయామశాలలో గల ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం గోపురం కలశపూజ సందర్భంగా అంజనేయస్వామిని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గట్టు చెన్నరాయుడి జాతర

గండీడ్ : మండల పరిధిలోని వరహగిరి గోవిందుపల్లిలో పురస్కరించుకొని గట్టు చెన్నరాయుడి జాతర జరిగింది. ఈ జాతరకు నారాయణపేట్, మహబూబ్‌నగర్, వికారాబాద్ జిల్లాల్లోతోపాటు కర్ణాటకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దేవరకద్ర : మండల పరిధిలో వెలిసిన రంగనాయక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఆలయంలో స్వామి వారి అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని పల్లకిపై ఉంచి ఆలయం చుట్టూ ఊరేగించారు. కార్యక్రమంలో ప్రజలు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిలోఫర్ ఆసుపత్రిలో చిన్నారికి పరామర్శ

హన్వాడ, ఆగస్టు 31 : మండలంలోని పెద్దదర్పల్లి గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి గీత డెంగీ జ్వరంతో హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పాలమూరు ఎంపీ డీకే అరుణ పరామర్శించారు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో చిన్నారి మహబూబ్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. జ్వరం తగ్గకపోవడంతో హైదరాబాద్ నిలోఫర్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నాట్లు చిన్నారి తండ్రి శివ శనివారం తెలిపారు. పెద్దదర్పల్లికి బీజేపీ నాయకుడు రఘురాంగౌడ్ ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లగా ఆమె నిలోఫర్ ఆర్ఎంవోతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

'పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 31 : పాతపెన్షన్ విధానం పునరుద్ధరించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించాలని కోరుత శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డిని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సనాతన బాలస్వామి, కేఎం చంద్రకాంత్‌లు, జిల్లా బాధ్యులు విజయ్, లక్ష్మయ్య, ఖాదర్ కష్టారెడ్డి, జీవన్‌రెడ్డిలు కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒప్పించాలని కోరారు. ఎమ్మెల్యేకు సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.